ప్రభాత
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
03-08-2024
శనివారం
మల్కాజిగిరి
సంపుటి : 01 | సంచిక : 335 | పేజీలు : 8 | వెల : 4
JB
జయభేరి



# టార్గెట్ రేవంత్

## మారుతున్న సమీకరణాలు

...మిగతాది 2 లో

తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటివరకు చేరికలతో జోష్ మీద ఉంది అధికార కాంగ్రెస్ పార్టీ.ఇక కెసిఆర్ పార్టీ నిర్వీర్యమే అన్నంత రేంజ్ లో రాజకీయం నడిచింది. కోలుకోలేని దెబ్బ తగిలిందని.. కెసిఆర్ కోలుకోవడం కష్టమని అంతా భావించారు. కానీ అనూహ్యంగా కాంగ్రెస్ పార్టీ నుంచి బీఆర్ఎస్ లో తిరిగి చేరికలు పెరగడం అధికార పార్టీని కలవరపరుస్తోంది. తెర వెనుక ఏం జరుగుతుందో తెలియక అధికార కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సతమతమవుతున్నాయి. కాంగ్రెస్ పార్టీ కంటే సీఎం రేవంత్ రెడ్డిని టార్గెట్ చేసుకొని సరికొత్త రాజకీయ క్రీడకు తెర తీసినట్లు తెలుస్తోంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరిగి ఏడాది కూడా కాలేదు. అప్పుడే బీఆర్ఎస్ నుంచి ఫిరాయింపులకు గేట్లు ఎత్తారు సీఎం రేవంత్ రెడ్డి.


## సరూర్ నగర్ సర్కిల్ ఫైవ్ లో భారీ అక్రమ నిర్మాణం

### పట్టించుకోని టౌన్ ప్లానింగ్ అధికారులు



**జయభేరి, హైదరాబాద్, ఆగష్టు 2 :**

ఎల్బీనగర్ జోన్ సరూర్ నగర్ లోని సర్కిల్ 5 కోదండరాం నగర్ లో సర్వేనెంబర్ 200 లోని ప్లాట్ నెంబర్ 22లో నిబంధనలకు విరుద్ధంగా భారీ అక్రమ నిర్మాణం కొనసాగుతుంది. ఈ అక్రమ నిర్మాణానికి జి ప్లస్ టు అనుమతులు ఉండగా... సదరు నిర్మాణదారునికి అధికారుల అండదండలు ఉండడంతో నాలుగు ఐదు అంతస్తులు నిర్మిస్తున్నాడు. ఈ అక్రమ నిర్మాణానికి స్వయంగా టౌన్ ప్లానింగ్ అధికారులే భారీగా ముడుపులు తీసుకుంటూ సహకరిస్తున్నారని ఆరోపిస్తున్న స్థానికులు. చిన్నచిన్న పేదల నిర్మాణాల వద్ద ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా కనీసం ముందస్తు సమాచారం కూడా ఇవ్వకుండా జేసీబీలతో నేలమట్టం చేసే ఈ అధికారులకు బడా బాబుల అక్రమ నిర్మాణాలు కనిపించవా అంటూ పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు బడా బాబుల అక్రమ నిర్మాణాలకు కొమ్ముకాయకుండా, వారిచ్చే ముడుపులకు ఆశపడకుండా కార్పొరేషన్ ఆదాయానికి గండి పడకుండా సహకరించాలని, అక్రమ నిర్మాణాల మీద కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుకుంటున్నారు.




## తెలంగాణలో జిఎస్‌డిపి 16 శాతం పెరిగింది

**జయభేరి, హైదరాబాద్, ఆగష్టు 2:**

రెవెన్యూ రాబడుల వృద్ధి రేటు ఒక శాతం తగ్గిందని కాగ్ నివేదికలో వెల్లడించింది. 2023 మార్చితో ముగిసిన ఏడాదికి రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై కాగ్ నివేదిక ఇచ్చింది. తెలంగాణ జిఎస్‌డిపి 202122తో పోలిస్తే 202223లో 16 శాతం పెరిగిందని, రెవెన్యూ రాబడులు గణనీయంగా 25 శాతం మేర పెరిగాయని, సొంత పన్నుల రాబడి గణనీయంగా 17 శాతం పెరిగిందని, సాగునీటి ప్రాజెక్టుల అంచనా వ్యయం రూ.2,06,977 కోట్లకు పెరిగిందని, 2023 మార్చి నాటికి పూర్తి కావాల్సిన 20 ప్రాజెక్టుల అంచనా వ్యయం పెరిగిందని, రూ.2749 కోట్ల మేర ద్రవ్యలోటు తక్కువ చేసి చూపించారని కాగ్ నివేదికలో పేర్కొంది.202223లో ప్రభుత్వం ఇచ్చిన రుణాలు, అడ్వాన్స్‌లు 150 శాతం పెరిగాయని, సొంత రాబడి లేని సంస్థలకు ప్రభుత్వం రుణాలు ఏర్పాటు చేసిందని, 202223లో బడ్జెట్ వెలుపలి రుణాలు రూ.1,18,629 కోట్లుగా అంచనా వేసిందని, ఆయా రుణాలకు ప్రభుత్వం తదుపరి రుణాలుగా రూ.17,829 కోట్లు అందించిందన్నారు. రాష్ట్రాభివృద్ధి రుణాల వడ్డీపై ఖర్చు తక్కువగా అంచనా వేస్తున్నారని, కేంద్రం నుంచి వచ్చే గ్రాంట్లను భారీగా అంచనా వేస్తున్నారని, ఎపి నుంచి తెలంగాణ విద్యుత్ కంపెనీలకు బకాయిలు రాలేదని, ఇళ్లు, గొర్రెల పంపిణీ, ఆయిల్‌ఫామ్ పథకాల నిధులు ఖర్చు కాలేదని, దళితబంధు, రుణమాఫీ పథకాలకు కేటాయింపుల్లో భారీగా ఖర్చు కాలేదని కాగ్ తెలిపింది.


## 15 వేల ఉద్యోగులను తొలగించిన ఇంటెల్

- ముందున్నాయి గడ్డు రోజులన్న సిఈవో

**జయభేరి, న్యూ ఢిల్లీ ఆగష్టు 2:**




ఇంటెల్ సీఈఓ పాట్ గెల్సింగర్ డబ్బును ఆదా చేయడం , ఖర్చులను తగ్గించుకోవడం కోసం కంపెనీ ఉద్యోగాలను తొలగిస్తున్నట్లు ఉద్యోగులకు తెలియజేశారు. 2025 నాటికి కంపెనీ $10 బిలియన్ల పొదుపును అందించాలని యోచిస్తోందని, దీని కారణంగా మొత్తం శ్రామికశక్తిలో 15% తగ్గుతోందని ఉద్యోగులందరికీ మెమోలో పాట్ గెల్సింగర్ వెల్లడించారు. ఇంటెల్ అర్హతగల ఉద్యోగుల కోసం మెరుగైన పదవీ విరమణ ఆఫర్‌ను ప్రకటించింది మరియు వచ్చే వారం స్వచ్ఛంద నిష్క్రమణల కోసం అప్లికేషన్ ప్రోగ్రామ్‌ను అందజేస్తుంది.అతను ఇలా తెలిపాడు, "నేను పంచుకోవడానికి ఇది బాధాకరమైన వార్త. మీరు చదవడం మరింత కష్టమవుతుందని నాకు తెలుసు. ఇంటెల్‌కి ఇది చాలా కష్టతరమైన రోజు, ఎందుకంటే మేము మా కంపెనీ చరిత్రలో అత్యంత పర్యవసానంగా కొన్ని మార్పులు చేస్తున్నాము.''



## నాపై దాడులకు ఈడీ సిద్ధమవుతోంది

- రాహుల్ గాంధీ..

**జయభేరి, ఢిల్లీ:**

ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఈడీ తనపై సోదాలకు సిద్ధమవుతోందని కాంగ్రెస్ ఎంపీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. ప్రతి ఇద్దరిలో ఒకరికి నా, చక్రవ్యూహం ప్రసంగం నచ్చలేదు. నాపై సోదాలకు సిద్ధమవుతున్నట్లు ఈడీలో పనిచేస్తున్న కొంతమంది వ్యక్తులు తెలిపారు. చాయ్, బిస్కెట్లతో వారిని ఆహ్వానించేందుకు సిద్ధంగా ఉన్నా' అని రాహుల్ గాంధీ తన ఎక్స్ ఖాతాలో వెల్లడించారు.

# అవసరమైతే సంపద సృష్టిస్తాను

## ఆ సంపదను పేదవారికి పంచుతాను

- ఇంతకుమించి సంక్షేమ పథకాలు అమలు చేస్తాను
- చంద్రబాబు నాయుడు

**జయభేరి, అమరావతి:**



ఎన్నికల ప్రచారం నాడు చంద్రబాబు చేసిన ప్రకటనలు ఇవి. గత ఐదు సంవత్సరాల వైసిపి పాలనలో సంక్షేమ పథకాల అమలు మాటున లూటి జరిగిందని చంద్రబాబు ఆరోపించారు. గత ఐదేళ్లుగా అవే ఆరోపణలు చేస్తున్నారు. ఏపీ ఒక శ్రీలంక మాదిరిగా తయారయిందని.. రాష్ట్ర అభివృద్ధి 20 సంవత్సరాల పాటు వెనక్కి నెట్టారని.. అప్పులు చేసి సంక్షేమ పథకాలు అమలు అవసరమా అంటూ చంద్రబాబు ఊరువాడా ప్రచారం చేశారు. కానీ తీరా ఎన్నికలు వచ్చేసరికి ప్లేట్ ఫిరాయించారు. సంక్షేమ పథకాలు అందిస్తానని చెబితేనే ప్రజలు యూటర్న్ తీసుకుంటారని భావించారు. అందుకే రెట్టింపు సంక్షేమ పథకాలు అంటూ ప్రచారం చేశారు. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమంది చదువుకు సాయం. 18 సంవత్సరాలు నిండిన మహిళలు ఉంటే నెలకు 1500 రూపాయలు సాయం. మూడు గ్యాస్ సిలిండర్లు ఫ్రీ. ఆర్టీసీ బస్సు ఎక్కితే ఫ్రీ.. ఇలా ఆల్ ఫ్రీ మాటలు చెప్పారు. నేను జగన్ మాదిరిగా కాదు.. అప్పులు చేయను.. అభివృద్ధి చేస్తాను.. ఆపై సంపద సృష్టించి మీ అందరికీ పంచుతాను.. అంటూ ప్రజలకు అంతులేని హామీలు ఇచ్చారు. ప్రజలు కూడా చంద్రబాబు మాటలను నమ్మారు. అయితే ఇప్పుడు చంద్రబాబు నాలుక మడత పెట్టారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేదని ప్రకటనలు చేస్తున్నారు. జగన్ చేసిన అప్పులు చూస్తుంటే ఆందోళనగా ఉందంటున్నారు. నీకు చాలా హామీలు ఇచ్చానని గుర్తు చేస్తున్నారు. వాటిని

...మిగతాది 2 లో

▸▸ మొదటిపేజీ తరువాయి

## టార్గెట్ రేవంత్

కాంగ్రెస్ పార్టీ కంటే సీఎం రేవంత్ రెడ్డిని టార్గెట్ చేసుకొని సరికొత్త రాజకీయ క్రీడకు తెర తీసినట్లు తెలుస్తోంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరిగి ఏడాది కూడా కాలేదు. అప్పుడే బీఆర్ఎస్ నుంచి ఫిరాయింపులకు గేట్లు ఎత్తారు సీఎం రేవంత్ రెడ్డి. దాదాపు పది మంది ఎమ్మెల్యేలు, అదే స్థాయిలో ఎమ్మెల్సీలు బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ లోకి ఫిరాయించారు. మొన్నటి సార్వత్రిక ఎన్నికల ఫలితాల తరువాత బీఆర్ఎస్ లో ఒక రకమైన చేంజ్ కనిపించింది. ఒక్క ఎంపీ సీటు కూడా గెలవకపోవడంతో.. ఇక ఆ పార్టీ భవిష్యత్తు లేదని ఆందోళన చెందిన ఎక్కువ మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కాంగ్రెస్ బాట పట్టారు. సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. అయితే కాంగ్రెస్ లో చేరిన చాలామంది ఎమ్మెల్యేలు అక్కడ ఇమడలేకపోతున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో కెసిఆర్ సైతం రాజకీయ పావులు కదపడంతో.. చాలామంది ఎమ్మెల్యేలు యూటర్న్ తీసుకున్నట్లు సమాచారం. ఇప్పటికే ఒక ఎమ్మెల్యే తిరిగి బిఆర్ఎస్ గూటికి చేరగా.. మరో ముగ్గురు బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు సైతం మాతృ పార్టీ వైపు ఆశగా చూస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో తెలంగాణ రాజకీయం సరికొత్త పుంతలు తొక్కుతోంది.బిఆర్ఎస్ నుంచి హేమాహేమీలు కాంగ్రెస్ లోకి వెళ్లారు. గతంలో పార్టీలో కీలక పదవులు అనుభవించిన వారు సైతం కాదనుకొని వెళ్లిపోయారు. స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, పఠాన్ చేరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి కాంగ్రెస్ లోకి వెళ్లారు. అధికారంలోకి వచ్చి ఏడాది కాకముందే ఫిరాయింపులకు కాంగ్రెస్ ప్రభుత్వం అవకాశం ఇవ్వడం పై విమర్శలు వ్యక్తం అయ్యాయి. అయినా కాంగ్రెస్ నాయకత్వం పెద్దగా పట్టించుకోలేదు.అయితే ఇప్పుడు కాంగ్రెస్ లో చేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు యూటర్న్ తీసుకుంటున్నారు. అక్కడ వాతావరణానికి ఇమడలేక పోతున్నట్లు తెలుస్తోంది. ఎక్కువ కాలం పాటు అక్కడ కొనసాగలేమని భావిస్తున్నట్లు సమాచారం. గద్వాల్ ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి ఇప్పటికే యూటర్న్ తీసుకున్నారు. కేటీఆర్ తో సమావేశమై బిఆర్ఎస్ లో కొనసాగుతానని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఆయనతోపాటు మరో ముగ్గురు ఎమ్మెల్యేల పేర్లు ప్రధానంగా వినిపిస్తున్నాయి. తెల్లం వెంకట్రావు, కాలే యాదయ్య, డాక్టర్ సంజయ్ కుమార్ సొంత గూటికి వెళ్తారనే ప్రచారం జరుగుతోంది.వాస్తవానికి కాంగ్రెస్ లో భిన్న పరిస్థితి ఉంది. బయటకు కనిపిస్తున్నంత సానుకూల వాతావరణం మాత్రం అక్కడ లేదు. ఆధిపత్యం కొనసాగుతోంది. ముఖ్యంగా సీనియర్ నేతల మధ్య విభేదాలు ఉన్నాయి. జిల్లాలో సైతం పార్టీ ఎమ్మెల్యేల మధ్య సమన్వయం లేదు. ఎమ్మెల్యేలు చేరుతున్న నియోజకవర్గాల్లో స్థానిక కాంగ్రెస్ నాయకత్వం వ్యతిరేకిస్తోంది. ఈ పరిణామాల క్రమంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న ఎమ్మెల్యేలు కొద్ది రోజులకే దూరమవుతున్నారు. ఇది అంతిమంగా సీఎం రేవంత్ రెడ్డి చరిష్మ పై ప్రభావం చూపే అవకాశం ఉంది.

## అవసరమైతే సంపద సృష్టిస్తాను

అమలు చేయగలనా? లేదా? అని సందేహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ప్రజల్లో టెన్షన్ ప్రారంభమైంది. పథకాల అమలు ఉంటుందా? లేదా? అని వారు భయపడుతున్నారు. మారిన ప్రకటనలు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు చంద్రబాబు చేసిన ప్రకటనలు ఒకలా ఉన్నాయి. సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన నాడు ఒకలా మారాయి. బాధ్యతలు స్వీకరించిన తరువాత ఇంకోలా వ్యవహార శైలి ఉంది. బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఏకంగా ఐదు ఫైళ్లపై సంతకం చేశారు. ఇక పథకాల అమలులో తిరుగు లేదన్నట్టు ప్రవర్తించారు. కానీఇప్పుడిప్పుడే క్లారిటీగా మాట్లాడుతున్నారు. అసలు విషయాలను వెల్లడిస్తున్నారు. శ్వేత పత్రాలతో సరి పథకాలు అమలు చేయకముందే జగన్ సర్కార్ వైఫల్యాలపై మాట్లాడడం ప్రారంభించారు చంద్రబాబు. వరుసగా శ్వేత పత్రాలు విడుదల చేశారు. జగన్ సర్కార్ ప్రజాధనాన్ని దోచుకుందని ఆరోపణలు చేశారు. పెద్ద ఎత్తున అప్పులు చేసిందని గణాంకాలు చూపించారు. ఈ పరిస్థితుల్లో తాను ఇచ్చిన హామీలు అమలు చేయాలంటే ఇబ్బందికర పరిస్థితులు తప్పవని బాంబు పేల్చారు. అసలు పథకాలు అమలు చేయడం కష్టమని చేతులెత్తేశారు.

**సోషల్ మీడియాలో ట్రోల్**

అయితే చంద్రబాబు హామీల విషయంలో వ్యవహరిస్తున్న తీరుపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ప్రచారం ప్రారంభమైంది. వైసిపి సోషల్ మీడియా విభాగం దీనిపై ట్రోల్ చేస్తోంది. పెద్ద ఎత్తున కామెడీ మీమ్స్ తో జత చేసి చేస్తున్న ప్రచారం ఆకట్టుకుంటుంది. దీనిపై నెటిజన్లు సైతం భిన్నంగా కామెంట్లు పెడుతున్నారు. పథకాల విషయంలో చంద్రబాబు ఎప్పుడు మాట మీద ఉన్నారు కదా? అని ఎక్కువమంది ప్రశ్నిస్తున్నారు. పథకాలపై ఆశలు వదులుకోవాల్సిందేనని తేల్చి చెబుతున్నారు.

## 5 వ తేదీ నుండి 9 వ తేదీ వరకు స్వచ్ఛదనం–పచ్చదనం



✍ జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 2 :

ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఈ నెల 5 వ తేదీ నుండి 9 వ తేదీ వరకు నిర్వహించే స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి జిల్లా కలెక్టర్ల ను ఆదేశించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో ఉన్న మౌళిక సమస్యలను పరిష్కరించాలన్నారు. స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమ నిర్వహణ పై గురువారం అన్ని జిల్లా కలెక్టర్లతో సచివాలయంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమం ద్వారా ఇంటింటికి మొక్కలు పంపిణీ చేయడమే కాకుండా అవి మనుగడ సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించాలన్నారు. పల్లె ప్రకృతి వనాలు, అర్బన్ ఫారెస్ట్ పార్కులు, సంపద వనాలు నిర్వహణ సరిగా ఉండేలా చూడాలన్నారు. గతంలో నాటిన మొక్కలలో ఏవైనా ఎండిపోయి ఉంటే వాటి స్థానంలో కొత్త మొక్కలను నాటాలన్నారు. దోమల నివారణ, అంటువ్యాదులు అరికట్టే చర్యలు, ఇంకుడు గుంతల నిర్వహణ కొత్త ఇంకుడు గుంతల ఏర్పట్ల పై అధికారులు శ్రద్ధ వహించాలన్నారు. ఇంకుడు గుంతల అవసరం పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.ఐదు రోజులు నిర్వహించే ఈ కార్యక్రమంలో రోజుకో ప్రత్యేకత ఉండేలా ప్రణాళిక రూపొందించి వాటి వివరాలను ఇప్పటికే కలెక్టర్లకు పంపించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలలోకి తీసుకు వెల్లెందుకు ఈ నెల 5 వ తేదీన ప్రజల భాగస్వామ్యంతో ర్యాలీలు నిర్వహించడం, విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించడం వంటి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అధికారులు ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం మంచి అవకాశమని మన రాష్ట్రంలో చాలా మంది కలెక్టర్లు యువకులే ఉన్నారని వారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు.

ప్రతి గ్రామంలో చురుకుగా ఉన్న యువజనల సంఘాలు, స్వచ్ఛంద సేవా సంస్థలు, రాజకీయ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు ప్రత్యేక టీం లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి అహ్మద్ నదీమ్, పీసీసీఎఫ్ ఎలుసింగ్ మేరు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, మున్సిపల్ శాఖ కమిషనర్ వీపీ గౌతమ్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఏడుపుల రాజకీయం

## ఎవరికి లాభం.. ఎవరికి నష్టం

✍ జయభేరి, హైదరాబాద్, ఆగస్టు 2:



తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు, చర్చలు అర్థవంతంగా సాగుతూండటం.. తెలుగు రాష్ట్రాల ప్రజలకు కాస్త కొత్తగా అనిపించింది. గత పదేళ్లుగా చట్టసభలు ఏ మాత్రం సానుకూలంగా సాగలేదు. ఏపీతో పాటు తెలంగాణలోనూ అదే పరిస్థితి. ఈ కారణంగా అసెంబ్లీలో చర్చలు జరగుతున్న వైనం అందర్నీ ఆకర్షించింది. ఓ సారి తెల్లవారుజామున మూడున్నర వరకూ చర్చించేశారు. అయితే ఈ స్ఫూర్తి ఒక్క రోజునే అడుగంటిపోయింది. బుధవారం అసెంబ్లీలో జరగిన పరిణామాలతో సభలో రాజకీయ వివాదాలు చోటు చేసుకున్నాయి. దీంతో చర్చ పక్కదారి పట్టింది. హడావుడిగా ద్రవ్య వినిమయ బిల్లు ఆమోదించాల్సి వచ్చింది. అంతటితో ఆగలేదు.. సభ బయట మహిళా ఎమ్మెల్యేలు కంట తడి పెట్టడం.. వెంటనే రేవంత్ దిష్టిబొమ్మల దహనానికి కేటీఆర్ పిలుపునివ్వడంతో ఈ రాజకీయం రోడ్డెక్కుతోంది. తెలంగాణ అసెంబ్లీలో జరిగిన చర్చలు తనను ఇద్దరు అక్కలు మోసం చేశారని వారిని నమ్మితే జూబ్లీ బస్టాండేనని సీఎం రేవంత్ యథాలాపంగా అన్న మాటలతో బీఆర్ఎస్ వ్యూహం మార్చింది.

రేవంత్ ఆ మాటలు తమను ఉద్దేశించే అన్నారంటూ సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిని తెర ముందుకు తెచ్చారు. అసలు రేవంత్ ఎవరి పేర్లు చెప్పకపోయినా.. వారంతటకే వారే తెరపైకి రావడంతో రాజకీయం మారిపోయింది. సబితా ఇంద్రారెడ్డి మైక్ తీసుకుని కాంగ్రెస్ లోకి తానే రేవంత్ ను పిలిచానని చెప్పారు. కౌంటర్ గా రేవంత్.. కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు తనను మల్కాజిగిరి నుంచి పోటీ చేయమని చెప్పి ఆమె బీఆర్ఎస్ లో చేరి.. తనను ఓడించేందుకు కుట్రలు చేశారని మండిపడ్డారు. ఆమె వ్యక్తిగత సంభాషణల గురించి చెప్పింది కాబట్టే తాను ఇలా చెప్పానన్నారు. తర్వాత భట్టి విక్రమార్క కూడా మోసానికి మరోపేరు సబితా ఇంద్రారెడ్డి అని .. తన సీఎల్పీ పదవి పోవడానికి సబిత ఎలా కారణమైందో చెప్పారు. భట్టి వ్యాఖ్యలను అంత సీరియస్‌గా తీసుకోని బీఆర్ఎస్ రేవంత్ మహిళా ఎమ్మెల్యేలను కించ పరిచారని.. ఆందోళన ప్రారంభించింది. ఈ వివాదం జరుగుతున్న సమయంలో రేవంత్ గవర్నర్‌కు ఆహ్వానం పలికేందుకు బేగంపేట ఎయిర్ పోర్టుకు వెళ్లారు. ఈ సందర్భంలో రేవంత్ క్షమాపణలు చెప్పాల్సిందేనని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పోడియంను చుట్టుముట్టారు. రేవంత్ అసెంబ్లీకి తిరిగి వచ్చిన తర్వాత సభ ప్రారంభమైన తర్వాత కూడా బీఆర్ఎస్ పట్టు వీడలేదు. దాంతో ద్రవ్య వినిమయ బిల్లును ఆమోదించినట్లుగా ప్రకటించి సభను వాయిదా వేశారు స్పీకర్. ఆ తర్వాత బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ బయట మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా .. సబితా ఇంద్రారెడ్డి కన్నీరు పెట్టుకున్నారు. రేవంత్ మహిళల్ని అవమానిస్తున్నారని.. తమను ఎందురు టార్గెట్ చేస్తున్నారని ప్రశ్నించారు. కాసేపటికే రేవంత్ దిష్టిబొమ్మల దహనానికి పిలుపునిచ్చారు. తానేదో వ్యాఖ్యలు చేశానని బీఆర్ఎస్ హడావుడి చేయడంపై రేవంత్ అసంతృప్తిలో ఉన్నారు. మీడియా ప్రతినిధులతో నిర్వహించిన చిట్ చాట్‌లో ఆయన తాను అన్‌పార్లమెంటరీ మాట ఒక్కటైనా మాట్లాడి ఉంటే చూపించాలని అన్నారు. వారిని తాను అక్కలనే సంబోధించానని అందులో తప్పేముందన్నారు. వ్యక్తిగత సంభాషణలను సబితా ఇంద్రారెడ్డి బయట పెట్టారు కాబట్టి తాను కొనసాగింపుగా ఏం జరిగిందో చెప్పానన్నారు. సునీతా లక్ష్మారెడ్డి కోసం ప్రచారం చేసి కేసుల్లో ఇరుక్కున్నానని ఆమె మాత్రం పార్టీ మారానని అదే చెప్పానని రేవంత్ అంటున్నారు.

అయితే రేవంత్ ఏమన్నారన్న సంగతి కన్నా.. ఏదో అన్నారన్న అభిప్రాయాన్ని కల్పించి... దిష్టిబొమ్మల దహనానికి పిలుపునివ్వడం ద్వారా అడ్వాంటేజ్ సాధించేందుకు బీఆర్ఎస్ నేతలు ప్రయత్నిస్తున్నారు. రాజకీయాల్లో భావోద్వేగ పూరిత అంశాలు వర్కవుట్ అయితే మంచి ఫలితాలు వస్తాయి. మహిళల్ని రేవంత్ అవమానించారని బీఆర్ఎస్ వాదనను గట్టిగా ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేయడానికి సిద్ధమయింది. దానికి కాంగ్రెస్ పార్టీ తన పార్టీ మహిళా నేతలతో కౌంటర్ ఇచ్చేందుకు సిద్ధమయింది. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి సీతక్కతో పాటు గత గవర్నర్ తమిళిసైపై చేసిన వ్యాఖ్యలను హైలెట్ చేస్తోంది. రేవంత్ రాజకీయంగా ప్రశ్నించారు తప్ప ఒక్క మాట కూడా నోరు జారలేదని అసలు బీఆర్ఎస్ నేతలే ఆ పని చేస్తున్నారని అంటున్నారు. పోటాపోటీగా చేసే మహిళలకు అవమానం ప్రచారంలో ఏ పార్టీ ఎక్కువ స్కోర్ చేస్తుందో కానీ.. తెలంగాణ అసెంబ్లీలో చర్చ మాత్రం.. పక్క దోవ పట్టేసింది.

# సీఎం రిలీఫ్ ఫండ్ అంటే ఏమిటి..?




- ఎల్ఓసి అంటే ఏమిటి..? అనేవి ఇప్పుడు తెలుసుకుందాం
- సీఎం రిలీఫ్ ఫండ్ దరఖాస్తులను ఇక నుండి ఆన్‌లైన్‌లో మాత్రమే స్వీకరించనున్న ప్రభుత్వం

సీఎం రిలీఫ్ ఫండ్ వేరు, ఎల్ఓసి (లెటర్ ఆఫ్ క్రెడిట్) వేరు. ఇప్పుడు వాటి గురించి అవగాహన కోసం తెలుసుకుందాం... సీఎం రిలీఫ్ ఫండ్ :సీఎం రిలీఫ్ ఫండ్ అంటే ఏదైనా వైద్య చికిత్స, ఆపరేషన్ మొదలగునవి (హాస్పిటల్లో కనీసం ఒక్క రోజైనా అడ్మిట్ అయి ఉండాలి) చేయించుకున్నప్పుడు, హాస్పిటల్ వారిచ్చే డిశ్చార్జి సమ్మరి ఆధారంగా ముఖ్యమంత్రి కార్యాలయానికి దరఖాస్తు చేసుకుంటే, చికిత్సకు ఆయిన మొత్తం లో 40 శాతం వరకు ఇచ్చేవారు. కానీ ఇప్పుడు ఎన్ని లక్షల బిల్లు అయినప్పటికీ గరిష్టంగా రూ.60 వేలు మాత్రమే మంజూరు చేస్తున్నారు.

**ఎల్ఓసి (లెటర్ ఆఫ్ క్రెడిట్) :** ఎల్ఓసి అనేది ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సకయ్యే ఖర్చు చెల్లిస్తామని ప్రభుత్వం ఇచ్చే హామీ పత్రం.ఎల్ఓసి అనేది ఎవరికైనా వైద్య చికిత్స, ఆపరేషన్ మొదలగునవి అవసరమున్నప్పుడు, బాధితుల దగ్గర ఒక్క రూపాయి కూడా లేనప్పుడు రాజకీయ నాయకులు, ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీల సిఫారసుతో ఇచ్చేదే ఎల్ఓసి. ఎల్వోసీ ద్వారా నగదు లేకుండానే ప్రైవేటు ఆసుపత్రుల్లో ఉచిత వైద్యం అందుతుంది.

ముఖ్యమంత్రి సహాయ నిధి ( సీఎం రిలీఫ్ ఫండ్ ) దరఖాస్తులను ఇక నుంచి ఆన్‌లైన్‌లో మాత్రమే తెలంగాణ ప్రభుత్వం స్వీకరించనున్నది. ఇందుకోసం సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ ఆధ్వర్యంలో రూపొందించిన వెబ్‌సైట్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత నెలలో సచివాలయంలో ప్రారంభించారు. సీఎంఆర్ఎఫ్ నిధులు పక్కదారి పట్టకుండా పారదర్శకతతో నిర్వహించాలని ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు.

గతంలో ఈ నిధులు పక్కదారి పట్టిన నేపథ్యంలో ఈ విధానాన్ని రూపొందించారు. ఇకముందు సీఎంఆర్ఎఫ్ దరఖాస్తులను ఈ వెబ్‌సైట్ లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. జూలై 1 నుంచి ఆన్ లైన్ లో మాత్రమే దరఖాస్తులను స్వీకరిస్తున్నారు.

సీఎంఆర్ఎఫ్ కోసం తమ వద్దకు వచ్చే వారి వివరాలు తీసుకుని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు తమ సిఫార్సు లేఖను జత చేసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.అప్లికేషన్ లో సంబంధింత దరఖాస్తుదారుడి బ్యాంక్ అకౌంట్ నెంబర్ తప్పనిసరిగా ఇవ్వాలి. అప్‌లోడ్ చేసిన తర్వాత సీఎంఆర్ఎఫ్ కు సంబంధించిన ఒక కోడ్ ఇస్తారు. ఆ కోడ్ ఆధారంగా ఒరిజినల్ మెడికల్ బిల్లులను సచివాలయంలో అందజేయాల్సి ఉంటుంది.

ఆన్‌లైన్ ద్వారా అప్లికేషన్‌ను సంబంధిత ఆస్పత్రులకు పంపించి నిర్ధారించుకుంటారు. అన్ని వివరాలు సరిగ్గా ఉంటే సీఎంఆర్ఎఫ్ దరఖాస్తును ఆమోదించిన తర్వాత పక్కదారి పట్టే అవకాశం లేకుండా చెక్ పైన తప్పని సరిగా దరఖాస్తుదారుడి అకౌంట్ నెంబర్‌ను ముద్రిస్తారు.



## మరో అంతర్జాతీయ స్టేడియం తీసుకొస్తాం

- తెలంగాణలో త్వరలో క్రీడా విధానం- స్పోర్ట్స్ పాలసీ
- శాసన సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

✍ జయభేరి, హైదరాబాద్ ఆగష్టు 2:

క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. నిఖత్ జరీన్‌కు ఆర్థిక సాయం చేయడంతో ఇంటి స్థలం కేటాయిస్తామని, టీమిండియా పేస్ బౌలర్ మహ్మద్ సిరాజ్‌కు విద్యార్హత లేకున్నా గ్రూప్ 1 ఉద్యోగం ఇస్తున్నామని స్పష్టం చేశారు. శాసన సభలో రేవంత్ రెడ్డి మాట్లాడారు. తెలంగాణలో త్వరలో క్రీడా విధానం తీసుకొస్తామని, హర్యానా క్రీడా విధానం పరిశీలిస్తున్నామని, త్వరంలో స్పోర్ట్స్ పాలసీని తీసుకువస్తామని, స్పోర్ట్ పాలసీపై ఎవరు సలహాలు ఇచ్చినా స్వీకరిస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో మరో క్రికెట్ మైదానం వస్తుందని, యూసుఫ్‌గూడ, గచ్చిబౌలి, సరూర్‌నగర్ స్టేడియాల్లో క్రీడలు తగ్గాయని, ఎల్‌బి స్టేడియంలో క్రీడలు తగ్గడంతో పాటు రాజకీయ కార్యకలాపాలు పెరిగాయన్నారు. హైదరాబాద్‌లో మరో అంతర్జాతీయ స్టేడియం తీసుకొస్తామని, స్కిల్ యూనివర్సిటీ సమీపంలో అంతర్జాతీయ స్టేడియం నిర్మిస్తామని, బ్యాగరికంచెలో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి బిసిసిఐతో చర్చలు జరిపామని రేవంత్ రెడ్డి తెలియజేశారు. క్రీడల కోసం బడ్జెట్‌లో రూ.321 కోట్లు కేటాయించామని, హర్యానా తరహాలో క్రీడాకారులను పోత్సహిస్తామన్నారు. భూముల లభ్యత చూసి మండల కేంద్రాల్లో స్టేడియాలు నిర్మిస్తామని, తెలుగువర్సిటీకి సురవరం ప్రతాపరెడ్డి పేరు పెట్టేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

## ఓయూలో నిరుద్యోగుల సంబురాలు

✍ జయభేరి, హైదరాబాద్:

కాంగ్రెస్ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ ప్రకటించడానికి నిరుద్యోగులు అందరూ వరంలా భావించాలని టిపిసిసి అధికార ప్రతినిధి చనగాని దయాకర్ అన్నారు. ఈ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం జాబ్ కార్డు ప్రకటిస్తున్న సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీలో చనగాని దయాకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దయాకర్ మాట్లాడుతూ జాబ్ క్యాలెండర్ ను తెలంగాణ రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగులు అందరూ స్వాగతించాలని కోరారు. తెలుగు రాష్ట్రాల్లో గత 32 ఏళ్లుగా ఎక్కడ సాధ్యం కాని జాబ్ క్యాలెండర్ ను కాంగ్రెస్ ప్రభుత్వం సాధ్యం చేసిందని అన్నారు.

# ఇక శరవేగంగా గౌరవెల్లి ప్రాజెక్ట్ పనులు..



- పెండింగ్ ప్రాజెక్ట్ పనులు పూర్తి కోసం 437.0 కోట్లు కేటాయిస్తూ కేబినెట్ ఆమోదం

**జయభేరి, హుస్నాబాద్ :**

గత 10 ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన హుస్నాబాద్ నియోజకవర్గంలో ఉన్న గౌరవెల్లి ప్రాజెక్టుకు స్థానిక శాసన సభ్యులు, రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ తో ఇక చక చకా పనులు కొనసాగనున్నాయి. ప్రాజెక్ట్ ప్రధాన కాలువల భూసేకరణ తదితర అంశాలు పెండింగ్ లో ఉన్నందున రాష్ట్ర క్యాబినెట్ లో తీసుకున్న నిర్ణయం తో త్వరలోనే పనులు పూర్తి చేసుకొని హుస్నాబాద్ తో పాటు, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గాల్లో బీడు భూములకు గోదావరి జలాలు తరలివచ్చి అక్కడ పంటలతో సస్యశ్యామలం చేయనున్నాయి. గౌరవెల్లి ప్రాజెక్ట్ తో పాటు ఎస్ఆర్ఎస్పీ, ఐఎఫ్ ఎఫ్సి లోని ప్యాకేజీ నంబర్,7 లోని పెండింగ్ పనుల పూర్తి చేయ డానికి రూ437.0కోట్ల రూపాయలు కేటాయిస్తూ క్యాబినెట్ నిర్ణయం తీసుకుంది. సవరించిన అంచనా ప్రతిపాదనలను క్యాబినెట్ ఆమోదించింది. గౌరవెల్లి ప్రాజెక్ట్ పూర్తయితే లక్షా ఆరు వేల 1,06,000, ఎకరా లకు సాగునీరు అందనుంది. ఈ ప్రాజెక్ట్ లో భాగంగా హుస్నాబాద్ నియోజకవర్గంలో 57,852 ఎకరాలు, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో 48,148 ఎకరా లకు సాగునీరు అందనుంది. గౌరవెల్లి ప్రాజెక్ట్ లో ఉన్న రెండు ప్రధాన కాలువల్లో కుడి కాలువ ద్వారా 90,000 ఎకరాలు, ఎడమ కాలువ ద్వారా 16 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది.

ఈ ప్రాజెక్ట్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో వైఎస్ఆర్ ముఖ్య మంత్రి గా ఉన్న సమయంలోనే రిజర్వాయర్ పనులు మొదలయ్యాయి. 13.07.2007 న ఈ ప్రాజెక్ట్ ను ఎస్ఆర్ఎస్పి రెండవ దశ లో వరద ప్రవాహ కాలువ ప్రాజెక్ట్ కింద పనులు చేపట్టడానికి రూ.913.15 కోట్ల రూపాయల తో పనులు చేపట్టడానికి అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన అను మతులు ఇచ్చింది. సంబంధిత రిజర్వాయర్ కాలువ పనులు చేపట్టడానికి ప్యాకేజీ 7 లో రూ. 278.58 కోట్ల రూపాయలను సమకూర్చింది. ఈ ప్రాజెక్ట్ కు అవస రమైన భూమి 3919 ఎకరాలు కాగా ,సేకరించిన భూమి 1676 ఎకరాలు, సేకరించవలిసిన మిగులు భూమి 2243 ఎకరాలు గా ఉంది.

ప్రస్తుతం ప్రాజెక్ట్ లో సిడి అండ్ సిఎం పనులు పెండింగ్ లో ఉన్నాయి. పొన్నం ప్రభాకర్ గత ఎన్నికల్లో ఈ ని యోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి గా అయినా తరువాత ప్రభు త్వం మీద ఒత్తిడి పెంచి ప్రభుత్వ ప్రాధాన్యత ప్రాజెక్ట్ ల లిస్ట్ లో గౌరవెల్లి ప్రాజెక్ట్ ను చేర్చి తన కమిట్మెంట్ ను నిరూపించుకున్నారు. గతంలో గౌరవెల్లి ప్రాజెక్ట్ బిఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి పై 2023 మార్చ్ 2 వ తేదిన పొన్నం ప్రభాకర్ లతో కలిసి పిసిసి చీఫ్ హోదాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రాజెక్ట్ ను సందర్శించారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉండి ప్రాజెక్ట్ ను సందర్శించి నప్పుడు కుర్చివేసుకొని ప్రాజెక్ట్ పూర్తి చేస్తన్న కేసీఆర్ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. ప్రాజెక్ట్ ప్రారంభిం చింది కాంగ్రెస్ అని పూర్తి చేసేది కూడా కాంగ్రెస్ అని ఆరోజు రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు, ముఖ్యమం త్రి హోదాలో ప్రాజెక్ట్ కు నిధులు కేటాయించారు.

హుస్నాబాద్ ఐఓసి.. లో మూడు జిల్లాల కలెక్టర్ లు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గౌరవెల్లి ప్రాజెక్ట్ కాలువల నిర్మాణానికి వేగవంతంగా భూ సేకరణ పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. క్యాబినెట్ లో పలు సందర్భాల్లో గౌరవెల్లి ప్రాజెక్ట్ అవసరాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళా రు. నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఇరిగేషన్ అధికారులతో ప్రాజెక్ట్ అవసరాలను వివ రించారు. ప్రాజెక్ట్ కు నిధులు కేటాయించేలా డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క వద్ద గౌరవెల్లి ప్రాజెక్ట్ పై వివరణ ఇచ్చి నిధులు కేటాయిం చేలా చేశారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ తోనే గౌరవెల్లి ప్రా జెక్ట్ పూర్తి చేసి తీరుతామని క్యాబినెట్ లో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో హుస్నాబాద్ లో హర్షతిరే కాలు వ్యక్తం అవుతున్నాయి.. ఇంతపెద్ద నిర్ణయం తీ సుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సహచర క్యాబినెట్ మంత్రులకు మంత్రి పొన్నం ప్రభాకర్ ధన్యవాదాలు తెలిపారు. త్వరలోనే ప్రాజెక్ట్ పూర్తి చేసుకొని నెర్రెలు బారిన పొరుగడ్డ హుస్నాబాద్ నియోజకవర్గంలో గోదావరి నీళ్ళు చేరి పాడి పంటలతో సస్యశ్యామలం అవుతుందని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆశాభావం వ్యక్తం చేశారు. తన జీవిత ఆశయం హు స్నాబాద్ నియోజకవర్గ ప్రజలకు గౌరవెల్లి ద్వారా నీళ్ళు అందించడమే లక్ష్యమని ప్రకటించిన మంత్రి పొన్నం ప్రభాకర్ ఆశయాధన కోసం నిరాటంకంగా పని చేస్తున్నారు.



# ప్రభుత్వం భూములలో గంజాయి డ్రగ్స్

**జయభేరి, కైకలూరు:**

ప్రభుత్వ భూములు హోం ఫర్ట్ ఇరిగేషన్ అధికారులు ఎక్కడ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.. కైకలూరు నియోజవర్గంలో.. ఆలపాడు.. ఉప్పుటేరు సరిహద్దు ప్రాంతంలో అక్కడ.. అసాంఘిక.. కార్య కలాపాలు గంజాయి, డ్రగ్స్ విక్రయిస్తున్నారని దీనిపై ఉన్నత యంత్రాంగం తగు చేపట్టాలని ప్రజలకు కోరుతున్నారు. అదేవిధంగా కృష్ణ పశ్చిమ గోదావరి సరిహద్దులో నిగా ఉంచి పూర్తిస్థాయిలో దర్యాప్ చేసి అక్రమార్కుల పై చర్యలు తీసుకొని అధికారులు పట్టించుకోవాలని కోరుతున్నారు.

# ఏపీలో నామినేటెడ్ పోస్టుల హడావిడి..

- ఆశగా ఎదురు చూస్తున్న 3 పార్టీలు..
- ఎవరికి ఎంత ప్రాధాన్యం అనే దానిపై ఆసక్తి..
- భర్తీ కోసం పార్టీల మధ్య ఈక్వేషన్‌కు కసరత్తు..



ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడింది.. మంత్రి పదవుల పంపకం పూర్తి అయ్యింది. ఆ తర్వాత ఎమ్మెల్సీలను కూడా షేర్ చేసుకున్నారు. ఇప్పుడు ఏపీ అధికార కూటమిలో నామినేటెడ్ పోస్టుల సందడి నడుస్తోంది. ఈ రెండు నెలల్లోగా విడతల వారీగా పోస్టుల జాతర ముగించేయాలనేది హైకమాండ్ ప్లాన్. మరోవైపు భర్తీలో ఈక్వేషన్లు ఎలా ఉంటాయనేది ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. పరిపాలన పరంగా సెక్రటేరియేట్ ఎంత బిజీగా ఉంటుందో, నామినేటెడ్ పోస్టుల విషయంలో కూటమి పార్టీల నేతలూ అంతే బిజీగా ఉంటున్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నానినేటెడ్ పోస్టుల భర్తీని విడతల వారీగా చేపట్టాలని చంద్రబాబు, పవన్ కల్యాణ్, పురందేశ్వరి భావిస్తున్నారు. ఈ క్రమంలోనే మూడు పార్టీల్లోనూ పార్టీ కోసం పని చేసిన నేతలు, కార్యకర్తల సమాచార సేకరణ జరుగుతోంది. కొందరు ఎమ్మెల్యేలు సహా టిక్కెట్లు దక్కించుకోలేని చాలా మంది నేతలు నామినేటెడ్ పోస్టుల కోసం ఆశగా ఎదురు చూస్తున్నా రు. తమకు ఎన్నికల్లో తక్కువ సీట్లే ఇచ్చినా సర్దుకుపోయామ ని. నామినేటెడ్ పోస్టుల్లో కచ్చితంగా ప్రియార్టీ లభిస్తుందనేది జనసేనలో జరుగుతున్న చర్చ. ఇటు తమకు కూడా ప్రాధాన్యత ఉంటుందని బీజేపీ కూడా భావిస్తోంది. ఇలా చూసుకుంటూ పోతే ఆశావహులు భారీగానే ఉన్నారు. ఈ క్రమంలో నామినేటె డ్ పోస్టుల భర్తీ ద్వారా కూటమి పార్టీల మధ్య బంధం మరింత బలపడేలా ఉండాలనే కానీ.. బలహీనపడడానికి బీజాలు పడేలా ఉండకూడదనే భావన మూడు పార్టీల్లో ఉంది. ఓవరాల్‌గా చూస్తే నామినేటెడ్ పోస్టుల భర్తీ కోసం పార్టీల మధ్య ఓ ఈక్వేషన్ తేవాలనే ఆలోచన చేస్తున్నట్టు సమాచారం. దానికి అనుగుణంగా పదవుల భర్తీ జరిగితే ఇబ్బంది ఉండదని భావిస్తోంది కూటమి. దీనికోసం ఎలాంటి కసరస్తు చేస్తుందో చూడాలి.

# ఘట్కేసర్ శివారెడ్డిగూడలో భారీ అక్రమ నిర్మాణం

- అక్రమ నిర్మాణానికి సహకరిస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు, స్థానిక కౌన్సిలర్

**జయభేరి, హైదరాబాద్, జులై 31 :**



ప్రభుత్వం ఎన్ని చట్టాలు తెచ్చినా, న్యాయ స్థానాలు ఎన్నిసార్లు హెచ్చరించినా అధికా రులు మారరు అక్రమ నిర్మాణాలు ఆగవు అని మరోసారి రుజువయింది. వివరాల్లోకి వెళితే మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ మండలంలోని నాలుగవ వార్డు శివారెడ్డిగూడ మారుతి నగర్ లో నిబంధనలకు విరుద్ధంగా భారీ అక్రమ నిర్మాణం కొనసాగుతుంది. ఈ అక్రమ నిర్మా ణానికి స్వయంగా టౌన్ ప్లానింగ్ అధికారులు అలాగే స్థానిక కౌన్సిలర్ సహకరిస్తున్నారని స్థా నికులు ఆరోపిస్తున్నారు. ఇక్కడ అనుమతులు జి ప్లస్ టు గా ఉంటే కట్టడాలు మాత్రం నాలుగు ఐదు అంతస్తులుగా నిర్మాణం చేపడుతున్నారు. సదరు నిర్మాణదారుడు అధికారులకు భారీగానే ముడుపులు చెల్లించాడని, అందుకే ఈ అక్రమ నిర్మాణం వైపు అధికారులు కన్నెత్తి కూడా చూడడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు. అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేసి చర్యలు చే పట్టాల్సిన అధికారులే ఇలా అక్రమ నిర్మాణాల వద్ద భారీగా మామూళ్లు తీసుకుని చూసి చూడ నట్టు వ్యవహరిస్తున్నారని పలువురు అభిప్రాయ పడుతున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారుల మీద ఇన్ని ఆరోపణలు వస్తున్నా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తూ సదరు నిర్మాణదారుడికి నామ మాత్రపు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకుం టున్నారు. సదరు నిర్మాణదారుడు అధికారులు ఇచ్చిన నోటీసులను కూడా లెక్కచేయకుండా తన పని తాను చేస్తున్న అతనిపై చర్యలు తీసు కోవాలని, ఇకనైనా అధికారులు కార్పొరేషన్ ఆదాయానికి సహకరిస్తూ అక్రమ నిర్మాణాలకు సహకరించకుండా వాటిపై కఠినచర్యలు తీసు కోవాలని కోరుతున్న స్థానిక ప్రజలు.

# ముందస్తు మాజీ సర్పంచుల అరెస్టు

- మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలి
- జరుపుల లోక్య నాయక్, మాజీ సర్పంచుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు


**జయభేరి, చందంపేట :**




చందంపేట అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆప లేరని, పెండింగ్లో ఉన్న మాజీ సర్పంచుల బిల్లుల ను వెంటనే చెల్లించిన తర్వాతనే స్థానిక సంస్థలు ఎన్నికలు నిర్వహించాలని మాజీ సర్పంచుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు జరుపుల లోక్య నాయక్ అన్నారు. అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్ల కుండా శనివారం పోలీసులు ముందస్తుగా మాజీ సర్పంచులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం అదేవిధంగా ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు కావస్తున్న ఇంకా బిల్లులు చెల్లించకపోవడం,తాజా మాజీ సర్పంచులు తీవ్ర మనోవేదనకు గురి చేస్తున్నా యని అన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించా లని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీలలో ఐదు సంవత్సరాలపాటు అనేక అభివృద్ధి చేసిన సర్పంచుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని మాజీ సర్పంచుల సంఘం డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో వీరితోపాటు మండల నాయకులు గోసుల శివ, జబ్బు శ్రీశైలం, జబ్బు తిరుపతయ్య, రామావత్ రామకోటి, దీపావత్ బలరాం తదితరులు పాల్గొన్నారు.

# దొంగలతో ప్రజలు భయం భయం

**జయభేరి, కైకలూరు :**



పగలురెక్కి నిర్వహించడం రాత్రి వేళలో బంగారం వెండి ఆభరణాలు తో పరారవడం సాధారణంగా జరిగే దొంగతనాలు ఇవి. కానీ ఇప్పుడు కొన్ని నెలల నుంచి మండలంలో చోరీలు తీరు మారాయిఎక్కడ విన్నా చోరీలు సంభాషణ ఇంజన్లు ఫాన్సెట్ మోటర్లు గేదెలు గొర్రెలు ట్రాక్టర్ టైర్లు ఈ విధంగా దొంగత నాలు జరగడంతో ముదినేపల్లి పోలీస్ స్టేషన్ లో పలు ఫిర్యాదులు నమోదయ్యాయి వరుస చోరీలతో రైతులు ప్రజలు భయపడుతున్నారు పోలీస్ శాఖనిగా పూర్తిగా వైఫల్య చెందుతుంద నిపలువురు ఆరోపిస్తున్నారు. మండలంలోని వి. రావు గుంట వణుదుర్రు ఊటుకూరు వాడవల్లి నారాయణపురం ముదినేపల్లి మెకానిక్ షెడ్ లో ఇంజన్ సామాన్లు సింగరాయపాలెంలో నీళ్ల మోటర్లు వాడారిలో గొర్రెలు నిత్యం వరస దొంగతనాలు ప్రజలు భయభ్రాంతులకు గుర వుతున్నారు. సీసీ కెమెరాలు ఫుటేజ్లు పర్సనల్ ఉన్నట్లు ఆ దర్యాప్తులతోనే మెగా పెంచామని పోలీసులు తెలుపుతున్నారు. రాత్రివేళ గస్తీని ముమ్మరం చేయాలని అనుమాదాస్పద వ్యక్తు లను విచారించాలని త్వరగా తమ కేసులను ఛేదించి రికవరీ అయ్యేలా పోలీసులు చర్యలు ముమ్మరం చేయాలని బాధితులు ప్రజలు కోరు తున్నారు.




# నిందితుడికి శిక్ష వేయాలని డిమాండ్

**జయభేరి, ఉప్పల్ :**

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఉప్పల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఉప్పల్ ఉన్న టువంటి లిటిల్ ఫ్లవర్ హై స్కూల్ లో రెండవ తరగతి చదువుతున్న అమ్మాయి పైన అదే స్కూల్ లో తొమ్మిదవ తరగతి చదువుతున్న అబ్బాయి లైంఘిక దాడిని నిరసిస్తూ అదేవిధంగా ఘటనకు కారకుడైనా నిందితుడికి ఉరి శిక్ష వేయాలని డిమాండ్ చేస్తూ ఆ పాఠశాల ఎదుట ధర్నా కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎల్.బి. నగర్ విభాగ్ కన్వీనర్ శ్యామ్ కిరణ్, ఉప్పల్ జిల్లా కన్వీనర్ బుర్ర అఖిల్, స్టేట్ టెక్నికల్ సెల్ కో కన్వీనర్ సచిన్, ఉప్పల్ నగర కార్యదర్శి సాయి సంతోష్, రామంతాపూర్ నగర కార్యదర్శి లోకేష్, సిద్ధు, శివ, వేణు, సాగర్, సాయి, అఖిల్, శివ సాయి, రాకేష్, నవీన్ పాల్గొన్నారు..

# ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరం

- టీపీసీసీ ఉపాధ్యక్షులు, మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ గారు
- బాధితులకు 96,5D00 వెయ్యిల చెక్కులను అందజేత



**జయభేరి, మూడుచింతలపల్లి :**

ఈ మేడ్చల్ నియోజకవర్గం మూడుచింతలపల్లి మండలం కొత్తూరు గ్రామానికి చెందిన టి అంజనేయులు, జి.సవితలు అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స కోసం జాయిన్ కావడంతో డబ్బులు లేక వైద్య ఖర్చుల కోసం ఇబ్బందులు పడుతుండ గా మూడు చింతలపల్లి మాజీ వైస్ ఎంపిపీ శ్రీనివాస్ రెడ్డి, మూడు చింతలపల్లి కాంగ్రెస్ పార్టీ ఆద్యక్షులు బోమ్మలపల్లి నర్సింహ్మా యాదవ్ లు మేడ్చల్ నియోజ కవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ దృష్టికి తీసుక రాగా వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి అంజనేయులుకు 41,500/, జి సవితకు 55,000/వెయ్యిల రూపాయలు ఇప్పించారు. శుక్రవా రం వారి కుటుంబ సభ్యులకు వజ్రేష్ యాదవ్ నివాసంలో చెక్కులను అందజేశా రు. ఈ సంధర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి, మంత్రి, వజ్రేష్ యాదవ్, కార్పోరేటర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు వజ్రేష్ యాదవ్ మా ట్లాడుతూ.. సీఎంఆర్ఎఫ్ ఆపత్కాలంలో ఎంతోమంది నిరుపదలకు ఆసరగా ని లుస్తుందన్నారు. పేద ప్రజలను ప్రభుత్వం ఎల్లప్పుడు అండగా ఉంటుందన్నారు.

# 9 నెలల నుండి 15ఏళ్లలోపు పిల్లలకు జేఈ వ్యాక్సినేషన్

- పందులను కుట్టిన దోమల వల్లే మెదడు వాపు వ్యాధి
- అంతర్జాతీయ తల్లి పాల దినోత్సవ వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్న - కౌన్సిలర్ కొడే మహేష్ కురుమ..!




**జయభేరి, మేడ్చల్ :**

మేడ్చల్ జిల్లా కేంద్రంలోని మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డులో గల అంగన్ వాడీ కేంద్రంలో 9నెలల నుండి 15ఏళ్లలోపు పిల్లలకు _జేఈ_ JE వ్యాక్సినేషన్ కార్యక్రమం,తదనంతరం తల్లి పాల వారోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్న కౌన్సిలర్ కొడే మహేష్ కురుమ.ఈ సందర్భంగా కౌన్సిలర్ కొడే మహేష్ కురుమ మాట్లాడుతూ దోమకాటు వల్ల సంక్రమించే మెదడు వాపు వ్యాధి సోకకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ రోజు వైద్యఆరోగ్య శాఖ వారి ఆధ్వర్యంలో ఈ రోజు మేడ్చల్ పట్టణంలోని అంగన్ వాడీ కేంద్రంలో 9 నెలల పిల్లల నుండి 15 సంవత్సరాల పిల్లల వరకు JE వ్యాక్సినేషన్ కార్యక్ర మాన్ని నిర్వహించడం జరిగింది.అదే విధంగా ప్రతి ఒక్కరూ తల్లి పాల ప్రాము ఖ్యత గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కౌన్సిలర్ కొడే మహేష్ కురుమ అన్నారు.మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డులో గల అంగన్ వాడీ కేంద్రంలో అంతర్జాతీయ తల్లి పాల వారోత్సవాల కార్యక్ర మం సందర్భంగా తల్లి పాల విశిష్టతను విస్తృత స్థాయిలో ప్రచారం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు.తల్లి తన బిడ్డకు ఇవ్వగల మొట్టమొద టి కానుక తల్లిపాలేనన్నారు.అదే విధంగా తల్లి పాల ప్రాముఖ్యతను మహిళలకు వివరించిన కౌన్సిలర్ కొడే మహేష్ కురుమ.ఈ కార్యక్రమంలో ఎంఎన్ఎం రజని, అంగన్ వాడీ టీచర్లు ఇందిరా, ధనలక్ష్మి,ఆశా వర్కర్లు సునీత, వసంత మహిళలు, పిల్లలు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది,అంగన్ వాడీ సిబ్బంది తదిత రులు పాల్గొన్నారు.

# డెంగ్యూతో నిండు గర్భిణి మృతి..

- కడుపులోని కవలలు కూడా..

**జయభేరి, వరంగల్:**

నెలలు నిండిన ఓ గర్భిణి మరికొద్ది రోజుల్లో కవలలకు జన్మనిస్తానని ఆనం దపడింది.అమ్మనయ్యే మధురానుభూతి పొందేందుకు ఆరాటపడింది. కానీ అంతలోనే డెంగ్యూ ఆ తల్లీబిడ్డలను బలి తీసుకుంది. హనుమకొండ గట్లకాని పర్తికి చెందిన శిరీష డెంగ్యూ జ్వరంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తనువు చాలించింది. ఆమె కడుపులో ఉన్న కవలలను బతికించేందుకు వైద్యులు చేసిన ప్రయత్నం వృథా అయింది. స్థానికంగా ఈ ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది.



## స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంపై అవగాహన

- గ్రామాల్లో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు కృషి చేయాలి - మండల ప్రత్యేకాధికారి సైదులు

**జయభేరి, ఆగస్టు 2 :**

మేడ్చల్ జిల్లా శామీర్ పేట్ మండల పరిషత్ కార్యాలయంలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంపై అవగాహన కల్పించారు. మండల ప్రత్యేకాధికారి సైదులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీవో, ఎంపీడీఓ ,ఆశ వర్కర్లు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం మండల ప్రత్యేకాధికారి సైదులు మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమంపై అవగాహన నిర్వహించినట్లు తెలిపారు. ప్రతీ గ్రామంలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలని ఇందుకు గాను పంచాయితీ ప్రత్యేకాధికారి సైదులు , ఆశావర్కర్, ముగ్గురు మహిళా వివోలతో కలిసి కమిటీ ఏర్పాటు చేసి ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు.

## లాల్ గడి మలక్ పేట్ గ్రామంలో తల్లి పాల వారోత్సవాలు

- తల్లిపాల ప్రాముఖ్యతపై గర్భిణీ స్త్రీలకు అవగాహన



**జయభేరి, ఆగస్టు 2:**

మేడ్చల్ జిల్లా లాల్ గడి మలక్ పేట్ గ్రామంలో తల్లి పాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడి టీచర్, ఆయా, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం గర్భిణీ స్త్రీలు, బాలెంతలకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. బిడ్డ పుట్టిన నాటి నుండి 6 నెలల పాటు తల్లిపాలు మాత్రమే పట్టాలని సూచించారు. తల్లిపాలు బిడ్డకు త్వరగా జీర్ణమవుతాయని తెలిపారు. అదేవిదంగా గర్భిణీ స్త్రీలు, బాలింతలు అంగన్ వాడి ద్వారా అందించే పౌష్టికాహారాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ రేణుక, అంగన్వాడి టీచర్స్,పుష్ప, రెహానా, అరుణ , ఆయాలు, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, తదితరులు పాల్గొన్నారు.

## నూతన కమిషనర్ ను సన్మానించిన బీజేపీ నాయకులు

- కమిషనర్ ను సన్మానించిన బిజెపి నాయకులు




**జయభేరి, మేడ్చల్:**

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ నూతన కమిషనర్ గా బాధ్యతలు చేపట్టిన ఎ.స్వామి ని శుక్రవారం మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు ఉషిగారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పట్లోళ్ల విక్రం రెడ్డి , అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్ రెడ్డి, నాలుగో వార్డ్ కౌన్సిలర్ అమరం సరస్వతి, మున్సిపల్ అధ్యక్షుడు ఉషిగారీ శ్రీనివాస్, జనరల్ సెక్రటరీ ముక్కిడి గల్ల మహేష్, సీనియర్ నాయకులు జైత్వాల కిషన్, మలిగే అశోక్, బీజేవైఎం జనరల్ సెక్రెటరీ సుంకు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## బిడ్డ తల్లులకు అవగాహన కార్యక్రమం



**జయభేరి, కైకలూరు :**

తల్లి పాల వారోత్సవాలను పురస్కరించుకొని ముదినేపల్లి మండలం లోని బొమ్మినంపాడు గ్రామంలోని 1వ అంగనవాడీ కేంద్రంలో బిడ్డ తల్లులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో సూపర్ వైజర్ శ్రీమతి ప్రసన్న మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే తల్లి పాలు పట్టించుట వల్ల అనేక వ్యాధులు నివారించడానికి అవకాశం ఉందని మరియు పిల్లలు చాలా బలంగా ఉంటారు ఆరోగ్యంగా వారి అవయవాలను ద్రోపరుచుకుని ఆరోగ్యంగా ఉంటారు అని వివరించారు. ఈ కార్యక్రమంలో అంగనవాడీ కార్యకర్త పద్మావతి, ఎంపిటిసి శ్రీమతి దాసరి అరుణ కుమారి, ఇతర అంగనవాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, వివో ఏలు మహిళలు పాల్గొన్నారు.

# ఒక్క రోజే 7 వేల మంది రిటైర్మెంట్

**జయభేరి, నెల్లూరు, ఆగస్టు 2 :**



జులై 31 ఒక్క రోజులోనే దాదాపు ఏడు వేలమంది ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ చేశారు. రెండేళ్ల క్రితం ఉద్యోగుల పదవీ విరమణ తర్వాత ఆర్థిక ప్రయోజనాలను చెల్లించడానికి తీవ్ర ఇక్కట్లకు గురవుతున్న సమయంలో జగన్ ప్రభుత్వం రెండేళ్ల నిర్బంధ సర్వీస్ పొడిగింపు అమలు చేశారు. ఉద్యోగులు స్వచ్ఛంధ పదవీ విరమణ చేసినా రెండేళ్ల తర్వాతే పదవీ విరమణ ప్రయోజనాలు అందిస్తామని నిబంధన విధించారు. జులై 31 కావడంతో ఒకేసారి భారీగా ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ చేశారు. గత జనవరి నుంచి ఉద్యోగుల పదవీ విరమణ మొదలైనా ఇంత భారీ సంఖ్యలో రిటైర్మెంట్‌లు కావడం ఇదే తొలిసారి.2022లో తీవ్ర ఆర్థిక ఒడిదుడుకులు ఎదుర్కొంటున్న ఏపీ సర్కారు ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందించలేని పరిస్థితుల్లో సర్వీసును రెండేళ్లు పొడిగించింది. 2024 జనవరితో రెండేళ్ళ పొడిగింపు కూడా ముగిసింది. జనవరి 31నుంచి ఉద్యోగుల రిటైర్మెంట్ మొదలైంది. పదవీ విరమణ చేసిన మూడు నెలల నుంచి ఆర్నెల్లలోపు వారికి సెటిల్మెంట్ చేస్తున్నారు.సర్వీస్ పూర్తైన ఉద్యోగుల్లో ఎక్కువ మంది జులైలో పుట్టిన వారు కావడంతో ఒకేసారి 31వ తేదీన రిటైర్ అయ్యారు. నాలుగేళ్ల క్రితం పదవీ విరమణ చేయాల్సిన వారు ఇప్పుడు పదవీ విరమణ చేస్తున్నారు. రాష్ట్ర విభజన తర్వాత 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఉద్యోగులకు పదవీ విరమణ వయసును 58 ఏళ్ళ నుంచి 60ఏళ్లకు పొడిగించారు. ఆ తర్వాత జగన్ హయంలో 62ఏళ్లకు పొడిగించారు. ఓ దశలో ఉద్యోగుల పదవీ విరమణ వయసును 63ఏళ్లకు 65ఏళ్లకు పెంచాలని కూడా జగన్ ప్రయత్నించారు. ఉద్యోగుల వ్యతిరేకతతో ఆ ప్రయత్నాలు విరమించుకున్నారు.ఏపీలో ప్రభుత్వ ఉద్యోగుల జీతాల చెల్లింపుకు గత కొన్నేళ్లుగా జాప్యం జరుగుతోంది. నవరత్నాల్లో భాగంగా సంక్షేమ కార్యక్రమాలకు నగదు బదిలీ చేయడానికి వైసీపీ ప్రభుత్వం ప్రాధాన్యమిచ్చింది.సంక్షేమ పథకాల్లో భాగంగా ప్రతి నెల ఒకటో తేదీన లబ్ధిదారులకు పెన్షన్ల నగదును పంపిణీ చేసేవారు. ఇతర నగదు బదిలీ పథకాలు, సంక్షేమ పథకాలకు ప్రాధాన్యమిచ్చిన ప్రభుత్వం ఉద్యోగుల జీతాల చెల్లింపుకు తర్వాత స్థానం ఇచ్చింది.వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే కోవిడ్ ముంచుకు రావడం, దాదాపు రెండేళ్ల పాటు దాని ప్రభావం కొనసాగింది. ఈ క్రమంలో రాష్ట్రం ఆర్థికంగా తీవ్ర ఒడిదడుకుల్ని ఎదుర్కొన్నా నగదు బదిలీ పథకాలు, నవరత్నాల పేరిట సంక్షేమ పథకాలు మాత్రం కొనసాగాయి. ఈ క్రమంలో జీతాలు, పెన్షన్ల చెల్లింపు గణనీయంగా ఆలస్యమయ్యేది.ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు ఆలస్యం కావడంతో గ్రూప్ సి,డి ఉద్యోగులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పెన్షనర్లు కూడా ఖాతాల్లో ఎప్పుడు జమ అవుతాయో నని పడిగాపులు పడాల్సి వచ్చేది. ఎన్నికలకు ఆర్నెల్లు ముందు నుంచి పెన్షనర్లకు మాత్రం సకాలంలో నగదు జమ చేస్తూ వచ్చారు.రాష్ట్రంలో ఎలక్షన్ కోడ్ అమల్లోకి రావడంతో కొత్త పథకాలు, పాత పథకాలకు నగదు బదిలీలకు మార్చిలో బ్రేకులు పడ్డాయి. దీంతో ఉద్యోగులకు వేతనాల చెల్లింపుకు ప్రాధాన్యత ఇచ్చారు. రాజకీయ ఒత్తిళ్లు లేకపోవడం, ఎన్నికల సంఘం పర్యవేక్షణలో పాలన సాగడంతో ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జీతాలను చెల్లించారు.ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం 14.76లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. వీరిలో 4,20,000 మంది ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో మరో లక్షా 28వేల మంది ఉద్యోగులు ఉన్నారు. ప్రభుత్వంలో విలీనమైన ఏపీఎస్ ఆర్టీసీలో 53వేల మంది ఉద్యోగులు ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి నేరుగా జీతాలు అందుకున్న వారు ఆరులక్షల మంది ఉద్యోగులు ఉన్నారు.ఏపీలో సర్వీస్ పెన్షనర్లు 3.58లక్షల మంది ఉన్నారు. సర్వీస్ పెన్షన్లపై ఆధారపడి ఫ్యామిలీ పెన్షన్ అందుకునే వారు మరో లక్ష మంది ఉన్నారు. ఇలా ప్రభుత్వ పెన్షనర్లు 4.58లక్షల మంది ఉన్నారు.ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు లక్షా 20వేల మంది వరకు ఉన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులు 80వేల మంది, అంగన్ వాడీ వర్కర్లు, సహాయకులు మరో లక్షమంది ఉన్నారు. హోమ్ గార్డులు 15వేల మంది ఉన్నారు. మొత్తం అన్ని శాఖల్లో కలిపి 14.76లక్షల మంది ప్రభుత్వం నుంచి జీతాలు, పెన్షన్లు అందుకుంటున్నారు.వరుసగా ఐదో నెలలో కూడా ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తున్నారు. ఏప్రిల్, మే , జూన్, జులైలో ఉద్యోగులు, పెన్షనర్లకు ఒకటో తేదీన జీతాలు, పెన్షన్లు చెల్లించారు. ఒకటో తేదీన జీతాలు రావడంతో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత కొన్నేళ్లుగా జీతాలు ఎప్పుడు వస్తాయో తెలియక సతమతం అయ్యేవారిమని, నెలవారీ ఖర్చులకు డబ్బులు కూడా ఉండేవి కాదని గుర్తు చేస్తున్నారు.

# మందకృష్ణ మాదిగ కి పాలాభిషేకం

**జయభేరి, దేవరకొండ :**



దేవరకొండ పట్టణంలోని స్థానిక అంబేద్కర్ విగ్రహం ముందు ఎమ్మార్పీఎస్ నాయకులు ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు సుప్రీంకోర్టు సానుకూలంగా తీర్పు ఇచ్చిన సందర్భంగా దేవరకొండ పట్టణానికి చెందిన మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఎంఆర్పిఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేసి, బాన సంచాలు పేల్చి, స్వీట్లు పంపిణీ చేస్తూ సంబరాలు చేశారు.

ఈ సందర్భంగా ఎం ఈ ఎఫ్ , ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భవించి 30 ఏళ్లు సుదీర్ఘమైనటువంటి శాంతియుత పోరాటానికి భారత అత్యున్నత న్యాయస్థానం న్యాయం చేసిందని అన్నారు. మాదిగ,మాదిగ ఉపకులాలకు చెందిన 59 కులాలకు ఎస్సీ రిజర్వేషన్ సమపాలల్లో అంది అన్ని వర్గాల అభివృద్ధి చెందుతాయని,ఎలాంటి తారతమ్మం లేకుండా మాదిగ, మాదిగ ఉపకులాలు తెగలవారు హర్షం వ్యక్తం చేయాల్సిన అవసరం ఉందని వారన్నారు. అంతేకాకుండా వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకే ఉందని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ పోరాటంలో చాలామంది అసలు బాచారని, వర్గీకరణ ఉద్యమాన్ని దెబ్బతీసేందుకు ఎన్నో కుట్రలు చేశారని, అయిన మొక్కవోని ధైర్యంతో ఏమాత్రం సహనం కోల్పోకుండా పట్టుదలతో పోరాటం చేసి విజయం సాధించామని, న్యాయం కోసం ఎమ్మార్పీఎస్ కు అండగా నిలబడిన వారందరికీ ఈ విజయం అంకితం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం ఈ ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వస్కుల సత్యనారాయణ, డివిజన్ ప్రెసిడెంట్ పులికంటి భాస్కర్, డివిజన్ ప్రధాన కార్యదర్శి ఆర్ పి.రాజ్, నల్ల వెంకటయ్య పొట్ట రాములు ముడి అంజయ్య మరియు ఎంఈఎఫ్,ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛదనం - పచ్చదనం విజయవంతం చేయాలి

- ఈనెల ఐదు నుంచి తొమ్మిది వరకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి.

**జయభేరి, దేవరకొండ :**




ఈనెల ఐదో నుంచి తొమ్మిదో తారీఖు వరకు స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్ ఎస్ ఓ శ్రీలక్ష్మి, దేవరకొండ ఇన్చార్జ్ ఎంపీడీవో నీలిమ మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి సంబంధిత పలు సూచనలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అన్ని గ్రామాలు పరిశుభ్రత పచ్చదనంతో పెంపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రజలను,ప్రజాప్రతినిధులను భాగస్వాములు చేయాలని సూచించారు. అధిక సంఖ్యలో మొక్కలు నాటాలని, చనిపోయిన మొక్కలను తొలగించి వాటి స్థానంలో కొత్తవి నాటి వాటిని చనిపోకుండా సంరక్షించాలని పేర్కొన్నారు. అన్ని గ్రామాల్లో పారిశుద్ధ నిర్వహణ పనులు చేపట్టాలని తెలిపారు.



ప్రతిరోజు ట్యాంకులను శుభ్రపరచి క్లోరినేషన్ చేయాలని పేర్కొన్నారు. వ్యాధులు ప్రబలకుండా స్వచ్ఛమైన తాగునీటిని అందించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మండల స్థాయి నుండి గ్రామ స్థాయి అధికారులు సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని కార్యక్రమాన్ని విజయవంతానికి తగిన కార్యచరణ రూపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్ ఎస్ ఓ శ్రీలక్ష్మి, ఇంచార్జ్ ఎంపీడీవో, మరియు ఎంపీ ఓ నీలిమ, గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీ సెక్రటరీలు, ఈ జి ఎస్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జువెలరీ దుకాణంలో అగ్ని ప్రమాదం

**జయభేరి, అనకాపల్లి:**

స్థానిక మెయిన్ రోడ్ లో గల జువెలరీ తయారుచేసే షాపులో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది ఈ ప్రమాదంలో షాపులో ఉన్న ఫర్నిచర్ , 60 వేల రూపాయలు నగదు పూర్తిగా కాలిపోయినట్లుగా షాపు యజమాని కసింకోట రాజా తెలియజేశారు. ఈ ప్రమాద సంఘటన తెలుసుకున్న ఫైర్ సిబ్బంది చేరుకున్న మంటలను అదుపులోకి తెచ్చారు.

## బిట్(రైస్ పులింగ్ ) కాయిన్ పేరుతో మోసం

**జయభేరి, విశాఖపట్నం:**

గోపాలపట్నంలో రైస్ పుల్లింగ్ మోసం బయటపడింది. రాజుల కాలం నాటి రాగి కాయిన్ అమ్మి లక్షా డెబ్బై వేలు ఇద్దరు కేటుగాళ్ళు కొట్టెసారు. గోపాలపట్నం కి చెందిన ఇద్దరు వ్యక్తులను తెలంగాణా అశ్వారావు పేటకు చెందిన గుత్తల నారాయణ రావు, మరొక వ్యక్తి మోసం చేసారు. విశాఖలో ఒక బారులో వీరి ముగ్గురికి పరిచయంఅయింది. తాము మోసపోయామని తెలుసుకుని నారాయణారావు ను 10 రోజులుగా ప్రహ్లాదపురం శ్రీ శివసాయి ప్లాట్ లో బాధితులను బంధించారు. నారాయణరావు అశ్వరావు పేటలో ఉంటున్న తన కుమారుడికి నన్ను కిడ్నాప్ చేశారని తెలపడంతో వ్యవహారం బయటపడింది. నారాయణారావు కుమారుడు పోలీసులకు సమాచారం అందించాడు. ప్రహ్లాదపురం అపార్ట్మెంట్ ప్లాట్ లో నిందితులను, కిడ్నాప్ చేసిన వ్యక్తులను గోపాలపట్నం పోలీసులువిచారిస్తున్నారు.

## వీధి కుక్క స్వైర విహారం.. పలువురికి గాయాలు

**జయభేరి, హైదరాబాద్:**

ఓ వీధి కుక్క స్వైర విహారం చేస్తూ, రోడ్డు పై కనిపించిన ప్రతి ఒక్కరినీ కరుస్తూ వెళ్లిన సంఘటన బాలానగర్ లో చోటు చేసుకుంది. స్థానికులు వివరాల ప్రకారం ఈ రోజు మధ్యాహ్న సమయంలో ఓ వీధి కుక్క మొదటగా నడుచుకుంటూ వెళ్తున్న ఓ బాలుడి పై దాడి చేసింది. బాలుడిని కుక్క నుండి కాపాడిన స్థానికులు ఆసుపత్రికి తరలించారు. అదే కుక్క సాయి నగర్, వినాయక్ నగర్, రాజు కాలనీలలో తిరుగుతూ మొత్తం 16 మందిపై దాడికి పాల్పడినట్లు స్థానికులు తెలిపారు. దాడికి గురైన వారిలో ఏడాదిన్నర వయస్సు నుండి 16 ఏళ్ళ వయస్సు చిన్నారులు, బాలురు ఉన్నారు . వారిని చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రులకు తరలించారు. సంవత్సరం క్రితం ఇదే ప్రాంతంలో ఓ కుక్క 10 మంది పై దాడి చేసిన సంఘటన మరువక ముందే మరో సంఘటన చోటు చేసుకోవటంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల బెడద నుండి విముక్తి కల్పించాలని కోరుతున్నారు.

## భార్యని హత్య చేసిన భర్త

**జయభేరి, రంగారెడ్డి:**

భార్యపై అనుమానంతో హత్య చేసిన సంఘటన రాచకొండ కమిషనరేట్ మీర్పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. నాగర్ కర్నూలు జిల్లాకు చెందిన జ్యోతి కి 35 తో 17 ఏళ్ళ క్రితం కుటుంబ సభ్యుల తో కలిసి మీర్ పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ని హస్తినాపురం అగ్రికల్చర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. భార్యపై అనుమానం పెంచుకున్న భర్త రాజుతో హత్య చేసి అనంతరం పోలీస్ స్టేషన్లో లొంగిపోయాడు. ఇన్స్పెక్టర్ నాగరాజు మన సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకొని మృతుగాని పోస్టు మార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.




# మూడో మెడల్ లోడింగ్..

**25 మీటర్ల పిస్టల్ ఈవెంట్ ఫైనల్‌కు మను భాకర్**

**ఒలింపిక్స్‌లో 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్ ఫైనల్‌కు మను భాకర్**

పారిస్ ఒలింపిక్స్‌లో అంచనాలకు మించి రాణిస్తున్న యువ షూటర్ మను భాకర్ మరోసారి పతకం దిశగా కీలక ముందడుగు వేసింది. ఈ ఎడిషన్‌లో ఇప్పటికే 10 మీటర్ల ఎయిర్ పిస్టల్, 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్స్‌లో కాంస్యాలు సాధించి చరిత్ర సృష్టించిన ఈ హర్యానా అమ్మాయి.. శుక్రవారం జరిగిన మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్ క్వాలిఫికేషన్ రౌండ్‌లో రెండో స్థానంతో ముగించి ఫైనల్‌కు అర్హత సాధించింది. శనివారం జరిగే ఫైనల్‌లోనూ గెలిస్తే వ్యక్తిగతంగా మూడో పతకం సాధించిన అథ్లెట్‌గా భారత ఒలింపిక్ చరిత్రలో తన పేరును సువర్ణాక్షరాలతో లిఖించుకుంటుంది. ఇదే ఈవెంట్‌లో పోటీపడ్డ హైదరాబాదీ యువ షూటర్ ఇషా సింగ్ మాత్రం నిరాశపరిచింది.

టోక్యో ఒలింపిక్స్‌లో ఎదురైన వైఫల్యాలకు పారిస్‌లో పతకాలతోనే దిమ్మతిరిగే సమాధానాలు చెబుతున్న యువ సంచలనం మను భాకర్ వరుసగా మూడో పతకంపై కన్నేసింది. తాజా ఎడిషన్‌లో ఇది వరకే రెండు కాంస్యాలు పట్టుకొచ్చిన మను.. శుక్రవారం ముగిసిన మహిళల 25 మీటర్ల పిస్టల్ ఈవెంట్ క్వాలిఫికేషన్‌లో 590 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంతో ముగించి ఫైనల్స్‌కు అర్హత సాధించింది. రెండు (ప్రిసీషన్, ర్యాపిడ్) భాగాలుగా జరిగే అర్హత రౌండ్‌లో మను తుపాకీ మరోసారి గురి తప్పకుండా లక్ష్యం వైపునకు దూసుకెళ్లింది. ప్రిసీషన్ మూడు సిరీస్‌లలో 97, 98, 99 పాయింట్లు స్కోరు చేసిన మను.. ర్యాపిడ్‌లో 100, 98, 98తో అర్హత రౌండ్‌ను రెండో స్థానంతో ముగించింది. హైదరాబాదీ షూటర్ ఇషా సింగ్ 581 పాయింట్లు స్కోరుతో తీవ్ర నిరాశపరిచింది.

ప్రిసీషన్ రౌండ్‌ను మను నెమ్మదిగానే మొదలుపెట్టింది. తొలి సిరీస్‌లో రెండు సార్లు మాత్రమే 10 పాయింట్లు సాధించిన ఆమె రెండో సిరీస్‌లో మాత్రం 4 సార్లు పది స్కోరు చేసింది.

3వ సిరీస్‌లో ఐదింటికి ఐదు షాట్లకు 10 పాయింట్లు వచ్చాయి. ఇక ర్యాపిడ్‌లోనూ ఇదే జోరును కొనసాగించింది. ర్యాపిడ్ మూడు సిరీస్‌లలో రెండు సార్లు 9 స్కోరు చేయగా ఒక్కసారి మాత్రమే 8 పాయింట్లు రాగా మిగిలిన ప్రతి షాట్‌కు 10/10 వచ్చాయి. హంగేరి షూటర్ వెరొనిక 592 స్కోరు చేసి అగ్ర స్థానంలో నిలిచింది. 8 మంది పోటీ పడే ఫైనల్‌లో మను ఇదే ఫామ్‌ను కొనసాగిస్తే హ్యాట్రిక్ మెడల్ పెద్ద కష్టమేమీ కాదు. ఇప్పటి వరకు భారత్ తరఫున సుదీర్ఘ ఒలింపిక్స్ చరిత్రలో ఒకే ఎడిషన్‌లో మూడు పతకాలు గెలిచిన ప్లేయర్ ఎవరూ లేకపోవడం విశేషం.

# స్నేహితులను మాత్రం మనం ఎంచుకోగలం



**ఫ్రెండ్షిప్ డే వచ్చిందంటే బెస్ట్ ఫ్రెండ్స్ కు పండగే. రోజంతా తమ స్నేహితులతో గడిపేందుకే ప్లాన్ చేస్తారు. మీ బెస్ట్ ఫ్రెండ్ తో ఈ ప్రత్యేక దినోత్సవాన్ని ఎలా సెలెబ్రేట్ చేసుకోవాలో కొన్ని ఐడియాలు ఇక్కడ ఇచ్చాము.**

మన కుటుంబాన్ని మనం ఎంచుకోలేం. కానీ స్నేహితులను మాత్రం మనం ఎంచుకోగలం. అపరిచితులుగా మొదలైన పరిచయం తరువాత బెస్ట్ ఫ్రెండ్స్ గా మారిపోతారు. ఎంతో మందికి స్నేహితులే ప్రాణం. వారి అండతోనే జీవించే వారు కూడా ఉన్నారు. అందుకే స్నేహబంధానికి ప్రపంచంలో ఎంతో విలువ ఉంది. స్నేహంలో నచ్చిన ఆహారం తినడం, కలిసి నవ్వుకోవడం, గాసిప్స్ మాట్లాడుకోవడం... ఎన్నో జ్ఞాపకాలను మూటగట్టుకోవడం అనేవి ఇద్దరు బెస్ట్ స్నేహితుల మధ్య ఉంటుంది. అది మరిచిపోలేని బంధంగా మారుతుంది.

ప్రేమ, ఆప్యాయతతో నిండిన స్నేహితులు ప్రతి ఒక్కరికి ఉంటారు. ఇద్దరు స్నేహితుల మధ్య చిలిపి జ్ఞాపకాలు ఎన్నో ఉంటాయి. ఏడిస్తే ఓదార్చే చేయి అందించేది స్నేహితులే. ఓడిపోతే ధైర్యంగా ఉండమని భుజం తట్టే స్నేహితుడు, గెలిచినప్పుడు ఆనందంతో బిగ్గరగా అరిచి సెలెబ్రేట్ చేసుకుంటాడు. ఉత్తమ స్నేహితులు లేని మన జీవితాన్ని మనం ఊహించలేము. ఇప్పుడు స్నేహితులే లేని జీవితాన్ని ఊహించడమే కష్టం. ఫ్రెండ్స్ అంటే మన జీవితాలను సులువుగా మార్చేవారు, మన నవ్వులను రెట్టింపు చేసేవారు, మన బాధలను పంచుకునేవారు... అందుకే స్నేహితుల కోసం ఫ్రెండ్షిప్ డే వచ్చింది. మీ అనుబంధాన్ని సెలబ్రేట్ చేసుకోవడానికి మేము ఇక్కడ కొన్ని ఐడియాలు ఇచ్చాము. స్నేహితుల దినోత్సవం ఆదివారమే వస్తుంది కాబట్టి, మీరు స్నేహితులతో రోజంతా గడపవచ్చు.

**రోడ్ ట్రిప్**

మీ బెస్ట్ ఫ్రెండ్స్ కారును బుక్ చేసుకుని నచ్చిన ఆహారాన్ని ప్యాక్ చేసి లాంగ్ డ్రైవ్ కు వెళ్లింది. నేషనల్ హైవేలపై రోడ్ ట్రిప్ కు వెళితే గాలి ముఖానికి తాకుతూ ఉంటే ఎంతో ఉత్సాహంగా ఉంటుంది. మీకు ఇష్టమైన పాటలు వింటూ మీ స్నేహితులతో ఆనందంగా గడపవచ్చు.

**రిసార్ట్ లో ఎంజాయ్**

ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు రిసార్ట్ ను బుక్ చేసుకుని పది మంది స్నేహితులతో కలిసి ఎంజాయ్ చేయవచ్చు. ఎన్నో గేమ్స్ ఆడడం, నచ్చిన ఆహారాన్ని కలిసి ఎంజాయ్ చేయడం, ఫోటోలు తీసుకోవడం ఇలా మీకు నచ్చిన విధంగా స్నేహితులతో సెలెబ్రేట్ చేసుకోవచ్చు.

**జూమ్ కాల్ లో**

చిన్ననాటి స్నేహితులు అంతా ఒక్కచోట ఉండకపోవచ్చు. వారు ఒక్కోచోట ఉండవచ్చు. కొంతమంది విదేశాల్లో కూడా ఉంటారు. అలాంటి వారంతా జూమ్ మీటింగ్ లో కలిసి సరదాగా కబుర్లు చెప్పుకోవచ్చు. మీరు భౌతికంగా దూరంగా ఉన్నా మీ మనసులు ఒక చోట చేరడానికి జూమ్ మీటింగ్ చాలు. ఉత్తమ స్నేహం మైళ్ల దూరంలో ఉన్నా కూడా వారి బంధం ఎప్పుడూ వికసిస్తూనే ఉంటుంది.

**పెయింటింగ్ క్లాసులు**

మీరు, మీ బెస్ట్ కలిసి సృజనాత్మకంగా ఫ్రెండ్షిప్ డే నిర్వహించుకోవచ్చు. ఇద్దరూ కలిసి నచ్చిన పని చేయండి. పెయింటింగ్ చేయడం, నచ్చినవి వండుకోవడం, షాపింగ్ కు వెళ్లడం వంటివి చేయండి.

**పిక్నిక్**

మీరు, మీ ఫ్రెండ్ కలిసి లంచ్ ప్యాక్ చేసుకుని ఏదైనా పార్కులో పిక్నిక్ ప్లాన్ చేయండి. ఈ ఫ్రెండ్షిప్ డే సందర్భంగా కాలేజీ జ్ఞాపకాలను నెమరువేసుకోండి. ఒక రోజంతా పార్కులో తిరుగుతూ ప్రతి విషయం గురించి మాట్లాడుకుంటూ కలిసి భోజనం చేయండి.

**కాఫీ డేట్**

మీ బెస్ట్ మేట్ ని కాఫీ డేట్‌కు తీసుకెళ్లండి. వారికి బహుమతులు ఇవ్వండి, లేఖలు రాయండి. గ్రీటింగ్ కార్డులు పంపండి. వారు మీకు ఎంత ముఖ్యమో వారికి తెలియజేయడానికి ప్రయత్నించండి.



# ఎంతైనా బిలియనీర్ కదా

**ఇషా అంబానీ క్యాజువల్ డ్రెస్‌కే ఇంత ఖర్చుపెట్టింది**

**ఇషా అంబానీ తన కుటుంబంతో కలిసి పారిస్ ఒలింపిక్స్ కు వెళ్లారు. ఆమె మ్యాచ్ చూస్తే కెమెరాలకు చిక్కారు. ఆ ఫోటోల్లో ఆమె వైట్ ఫ్లోరల్ ప్రింట్ ఫ్రాక్‌ను ధరించారు. క్యాజువల్ గా కనిపిస్తున్న ఈ డ్రెస్ ఖరీదు మాత్రం ఎక్కువే.**

2024 పారిస్ ఒలింపిక్స్ సందర్భంగా ఇషా అంబానీ కుటుంబంతో కలిసి పారిస్ వెళ్లారు. నూతన వధూవరులు అనంత్ అంబానీ, రాధికా మర్చంట్, ఇషా భర్త ఆనంద్ పిరమాల్, తండ్రి ముఖేష్ అంబానీ, తల్లి నీతా అంబానీ కూడా వెళ్లారు. ఆమె ఒక మ్యాచ్ కు చాలా సాధారణ డ్రెస్ వేసుకుని కనిపించింది. అది సింపుల్ వైట్ ఫ్లోరల్ ప్రింట్ డ్రెస్. ఈ డ్రెస్ ధర తెలిస్తే షాక్ అవుతారు. బిలియనీర్ అయిన ఆమెకు ఈ

ఇషా అంబానీ తన కుటుంబంతో కలిసి పారిస్ ఒలింపిక్స్ కు హాజరయ్యేందుకు తెలుపు రంగు మిడి దుస్తులను ధరించింది. ఈ బృందం హిల్ హౌస్ హోమ్ అనే దుస్తుల లేబుల్ నుండి డ్రెస్ లను కొనుగోలు చేసింది. ఇది బ్రాండెడ్ దుస్తులు. విదేశాల్లోనే లభిస్తాయి. ఆ లేబుల్ అధికారిక వెబ్ సైట్లో లభిస్తుంది. దీన్ని ఎల్లీ నాప్ డ్రెస్ అని పిలుస్తారు. ఈ దుస్తులను మీ దగ్గరకు చేర్చుకుంటే మీకు సుమారు రూ.20,448 ఖర్చవుతుంది.

ఇషా హిల్ హౌస్ హోమ్ వైట్ మిడి డ్రెస్ లో చతురస్రాకార నెక్ లైన్, శరీరంపై ఎలాస్టిక్ స్మాకింగ్, భుజం స్లీవ్స్, టైర్డ్ మిడి లెంగ్త్ స్కర్ట్, సైడ్ పాకెట్స్, ఫిగర్ స్కిమ్మింగ్ సిల్హౌట్ ఉన్నాయి. ఆకుపచ్చ, గులాబీ, నీలం, లావెండర్ రంగులలో అందమైన పూల నమూనా ఇషా వస్త్రధారణకు అందాన్ని జోడించింది.

హెర్మెస్ బ్లాక్ స్లిప్ ఆన్ చెప్పులు, డైమండ్ హూప్ చెవిపోగులతో సహా తక్కువ యాక్సెసరీలతో ఇషా చాలా స్టైలిష్‌గా చేసింది. ఇదిలా ఉంటే గ్లామర్ లుక్ కోసం ఈ ముద్దుగుమ్మ నల్లటి కనుబొమ్మలు, మేకప్ లేని లుక్, ఎర్రబడిన బుగ్గలు, పెదవులకు లేత రంగులను ఎంచుకుంది. ఫినిషింగ్ టచ్ కోసం ఆమె తన హెయిర్ స్టైల్‌ను పోనీటెయిల్‌గా కట్టుకుంది.

**ఇషా అంబానీ గురించి**

ఆసియాలోనే అత్యంత ధనవంతుడైన ముఖేష్ అంబానీ, ఆయన భార్య నీతా అంబానీల పెద్ద కుమార్తె ఇషా అంబానీ. ఆమె తోబుట్టువులు ఆకాశ్ అంబానీ, అనంత్ అంబానీ. ఆనంద్ పిరమల్ ను ఇషా వివాహం చేసుకుంది. డిసెంబర్ 12, 2018న వీరి వివాహం అంగరంగ వైభవంగా జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఒక కుమారుడు కృష్ణ, ఒక కుమార్తె ఆదియా. ఈ పిల్లలు కవలలు, ఇటీవల వోగ్ కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇషా అంబానీ తన తల్లి నీతా అంబానీ మాదిరిగానే ఐవీఎఫ్ ద్వారా తన పిల్లలకు జన్మనిచ్చింది.



# మూవీభేరి

## తమిళంలో బంపరాఫర్..

### కార్తీ సరసన మాళవిక మోహనన్

మలయాళం, తమిళ భాషల్లో ప్రతిభావంతురాలైన కథానాయికగా పేరు తెచ్చుకుంది మాళవిక మోహనన్. ప్రస్తుతం ఈ భామ తెలుగులో ప్రభాస్ సరసన 'రాజాసాబ్' చిత్రంలో నటిస్తున్నది. తాజాగా ఆమె తమిళంలో కార్తీ సరసన కథానాయికగా నటించే బంపరాఫర్‌ను దక్కించుకుంది. వివరాల్లోకి వెళితే.. కార్తీ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'సర్దార్ 2' ఇటీవలే ప్రారంభమైంది. పీఎస్ మిత్రన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ చెన్నైలో జరుగుతున్నది. ఈ సినిమాలో మాళవిక మోహనన్ కథానాయికగా ఖరారైంది. ఈ విషయాన్ని శుక్రవారం మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నామని, కథాగమనంలో మాళవిక మోహనన్ పాత్రకు చాలా ప్రాధాన్యత ఉంటుందని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: యువన్‌శంకర్ రాజా, నిర్మాత: ఎస్.లక్ష్మణ్ కుమార్.



## జాన్వీతో ఎన్టీఆర్ రొమాన్స్


ఎన్టీఆర్ కథానాయకుడిగా కొరటాల శివ దర్శకత్వంలో రూపొందిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'దేవర' నిర్మాణం నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నది. రెండు భాగాలుగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. 'దేవర పార్ట్ 1' సెప్టెంబర్ 27న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ చిత్రంలో జాన్వీకపూర్ కథానాయికగా నటిస్తుండగా, సైఫ్‌అలీ ఖాన్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాకు సంబంధించిన తాజా అప్‌డేట్ వెలువడింది. మ్యూజికల్ ప్రమోషన్స్‌లో భాగంగా రెండో గీతాన్ని ఈ నెల 5న విడుదల చేయబోతున్నారు. శుక్రవారం ఈ పాట తాలూకు పోస్టర్‌ను రిలీజ్ చేశారు. అనిరుధ్ సంగీతాన్నందిస్తున్న ఈ పాట రొమాంటిక్ మెలొడీగా ఆకట్టుకుంటుందని, ఎన్టీఆర్ నృత్యాలు, జాన్వీకపూర్ అందచందాలు ప్రధానాకర్షణగా నిలుస్తాయని మేకర్స్ తెలిపారు. ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ పతాకాలపై సుధాకర్, హరికృష్ణ కె. ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



## గట్టుదాటి గుండె కొట్టుకున్నదే..

రవితేజ కథానాయకుడిగా హరీష్‌శంకర్ దర్శకత్వంలో రూపొందిన తాజా చిత్రం 'మిస్టర్ బచ్చన్' ఈ నెల 15న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలేర్పడ్డాయి. రిలీజ్ తేదీ దగ్గరపడుతుండటంతో ప్రచార పర్వంలో జోరు పెంచారు. శుక్రవారం మూడోగీతం 'జిక్కి..' విడుదలైంది. మెలోడీ ప్రధానంగా స్వరకర్త మిక్కీ జే మేయర్ ఈ పాటను తీర్చిదిద్దారు. అటు కాశ్మీర్ అందాలూ, ఇటు నాయకానాయికల కెమిస్ట్రీ రెండూ ఆకట్టుకునేలా ఉన్నాయి. 'నిన్ను చూసి గుండె ఒట్టు పెట్టుకున్నదే.. గట్టు దాటి గట్టిగానే కొట్టుకున్నదే.. పట్టుబట్టి పూల చేయి పట్టుకున్నదే.. అగ్గిరాజేశాక ఆగేదెట్లాగే..' అంటూ చక్కటి ప్రణయభావాలతో ఈ పాట సాగింది. వనమాలి రాసిన ఈ పాటను కార్తీక్, రమ్య బెహరా ఆలపించారు. ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో ఈ చిత్రాన్ని విడుదల చేయబోతున్నామని మేకర్స్ ప్రకటించారు. భాగ్యశ్రీబోర్సే, జగపతిబాబు, సచిన్‌ఖేడేకర్, సత్య తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జే మేయర్, నిర్మాత: టీజీ విశ్వప్రసాద్, రచనదర్శకత్వం: హరీశ్‌శంకర్.





## విధి ఎదురుచూపులో విజయ్ దేవరకొండ

తక్కువ టైమ్‌లోనే పాన్‌ఇండియా స్టార్‌గా ఎదిగారు విజయ్ దేవరకొండ. సక్సెస్, ఫెయిల్యూర్లతో నిమిత్తం లేని మార్కెట్ ఆయనది. సినిమా విజయం సాధిస్తే.. ఆ వసూళ్లు టాప్‌గ్రేడ్ హీరోలకు ఏ మాత్రం తీసిపోవు. అదీ విజయ్ ఇమేజ్. ప్రస్తుతం ఆయన చేస్తున్న సినిమాకు వర్కింగ్ టైటిల్ 'వీడీ 12'. గౌతమ్ తన్ననూరి దర్శకుడు. ఇంటెన్స్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ శ్రీలంకలోని పలు సుందరమైన ప్రదేశాల్లో జరిగింది. ఇప్పటివరకూ 60శాతం చిత్రీకరణ పూర్తయింది. వచ్చే ఏడాది మార్చి 28న సినిమాను విడుదల చేయనున్నట్టు నిర్మాతలు సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య తెలిపారు. 'హిజ్ డెస్టినీ అవెయిట్స్ హిమ్' అంటూ ఈ సినిమా పోస్టర్‌ను తన సోషల్‌మీడియా ఖాతాల్లో షేర్ చేశారు విజయ్ దేవరకొండ. ఈ సినిమా టైటిల్, ఫస్ట్‌లుక్‌ని ఈ నెలలోనే విడుదల చేయనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్ రవిచందర్.

**వయనాడ్ బాధితులకు అండగా..**

ఇటీవల కేరళలోని వయనాడ్‌లో సంభవించిన వరదల్లో వందలాది మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. ఆస్తి నష్టం కూడా భారీగానే జరిగింది. ఈ నేపథ్యంలో వయనాడ్ బాధితులకు అండగా కేరళ ప్రభుత్వ సహాయనిధికి 5లక్షల విరాళాన్ని అందజేసినట్లు సితార ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ప్రకటించింది. 'లక్కీ భాస్కర్' టీమ్ తరపున ఈ విరాళాన్ని అందిచినట్లు పేర్కొంది.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com